ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 05-09-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. అన్ని మతాలను గౌరవించే హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

2. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతి సందర్భంగా ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుగపుకుంటున్నారు.

3. రాష్ట్రంలో ఎంపిక చేసిన గ్రామ పాలనాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సాయంత్రం నియామక పత్రాలు అందజేస్తారు.

4. రాష్ట్రంలో రాబోయే మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**నిమజ్జనం-సీఎం**

అన్ని మతాలను గౌరవించే హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ఉదయం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకొని ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని అన్ని గణేష్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించిందని తెలిపారు. ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ట్యాంక్

బండ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నిమజ్జనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

(సీఎం బైట్)

ప్రెస్ నోట్

<u>నిమజ్జనం ఏర్పాట్లు</u>

వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్ లో రేపు శోభాయాత్ర నిర్వహిస్తారు. రేపు ఉదయం 6 గంటల నుంచి ఎల్లుండి ఉదయం 10 గంటల నిమజ్జన కార్యక్రమం జరగనుంది. ఇందుకోసం ప్రభుత్వం యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతతో పాటు పకబ్బంధీ ఏర్పాట్లు చేసింది. ఈ మధ్యాహ్నం నుంచే మహాగణపతి నిమజ్జన ఏర్పాట్లను ప్రారంభించారు. రేపు మధ్యాహ్నం ఒంటిగంట న్నరలోపు నిమజ్జనం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు తెలి పారు. నిమజ్జనం నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కాగా , నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్ , రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రేపు సెలవు ప్రకటించారు. రాష్ట్ర హైకోర్టు సహా హైదరాబాద్ , సికింద్రాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలోని కోర్టులకు సెలవు వర్తిస్తుందని హైకోర్టు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు.

(డెస్క్)

**<u>పొన్నం ప్రభాకర్</u>**

హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ , జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఈ ఉదయం హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై గణేష్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఖైరతాబాద్ గణేష్ విగ్రహ నిమజ్జనం జరిగే ప్రాంతాన్ని కూడా ఆయన

పరిశీలించారు. మూడు రోజులుగా నిమజ్జనం జరుగుతున్న నేపథ్యంలో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు.

(డెస్క్)

**ఉపాధ్యాయుల దినోత్సవం**

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతి సందర్భంగా ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుగపుకుంటున్నారు. తరగతి గదుల్లో దేశ భవితను తీర్చిదిద్దే మార్గదర్శకులు, సమాజానికి జ్ఞానాన్ని పంచుతున్న గురువులందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయా జిల్లాల్లో ప్రజా ప్రతినిధులు , అధికారులు సర్వేపల్లి రాధాకష్ణన్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

**సిరిసిల్ల**

ప్రభుత్వ విద్యా సంస్థలపై విద్యార్థులు తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా బోధించాలని , రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ విప్ , వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తో కలిసి 17 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు.

(పీటీసీ, సిరిసిల్ల)

**ఆసిఫాబాద్ ఉపాధ్యాయ దినోత్సవం**

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఈరోజు ప్రభుత్వ విద్యా సంస్థలకు సెలవు దినం కావడంతో సాధారణ పాఠశాలల్లో నిన్ననే వేడుకలు నిర్వహించగా , ఆశ్రమ పాఠశాలలు , గురుకులాలలో నేడు

వేడుకలు జరుపుకుంటున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణతో పాఠాలు బోధిస్తున్నారు.

(పీటీసీ, ఆసిఫాబాద్)

<u>**వీఆర్ఏ-నియామక పత్రాలు**</u>

రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి , రైతులకు మెరుగైన సేవలు అందించడానికి గ్రామ పాలనాధికారులను నియమిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సాయంత్రం హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జీపీవోలకు నియామక పత్రాలు అందజేస్తారని వెల్లడించారు. గ్రామ పాలనాధికారులుగా విధులు నిర్వహించడానికి ఆసక్తి చూపిన వీఆర్ఓ , వీఆర్ఏ లలో 5 వేల 106 మంది రెండు విడతల్లో నిర్వహించిన పరీక్షల్లో ఎంపికయ్యారు.

(డెస్క్)

**బ్రేక్**

**జర్మనీ కంపెనీ-సీఎం**

జర్మనీకి చెందిన ప్రముఖ వైద్య పరికరాల తయారీ సంస్థ BEBIG Medical తెలంగాణలో తమ ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించడానికి ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు కంపెనీ చైర్మన్, సీఈఓ జార్జ్ చాన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో కలిసింది. రాష్ట్రంలో యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అవసరమైన స్థలం , ఇతర అంశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరికరాలతో పాటు , క్యాన్సర్ చికిత్సకు

ఉపయోగపడే రేడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధులను ముఖ్యమంత్రి కోరారు.

(పీఎన్)

**<u>పీఎం కిసాన్ సమ్మాన్-వరంగల్ బైట్</u>**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఆర్థిక భరోసాతో రైతులకు పెట్టుబడి సాయం లభిస్తుందని వరంగల్ జిల్లా , నర్సంపేటకు చెందిన రైతు శ్రీనివాస్ ఆకాశవాణితో తెలిపారు.

**( సౌండ్ బైట్... నర్సంపేట రైతు శ్రీనివాస్)**

(పిటిసి, వరంగల్ జిల్లా)

**<u>మిలాద్-ఉన్-నబీ</u>**

ముహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా జరుపుకునే పండుగ , మిలాద్-ఉన్-నబీని రాష్ట్ర వ్యాప్తంగా భక్తి శ్రద్దలతో జరుపుకుంటున్నారు. చారిత్రక చార్మినార్ సమీపంలోని మక్కా మసీదుతో సహా అన్ని ప్రధాన మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. మిలాద్ – ఉన్ - నబీ పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

(ఎంఎస్ఎల్)

**<u>వాతావరణం</u>**

రాష్ట్రంలో రాబోయే మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు , మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. రేపు , ఎల్లుండి

ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని యెల్లో అలర్ట్ జారీ చేసింది.

(డెస్క్)

**<u>నిమజ్జనం-గ్రేటర్ వరంగల్</u>**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈరోజు గణేష్ నిమజ్జనోత్సవానికి అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఒక కోటి 20 లక్షల రూపాయలతో 22 ప్రధాన చెరువుల వద్ద పనులు పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం 32 క్రేన్లు, 50 తెప్పలను అందుబాటులో ఉంచారు.

(పీటీసీ, వరంగల్)

**<u>కరీంనగర్ -గణేష్ నిమజ్జనం ప్రారంభం</u>**

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నేడు వినాయక విగ్రహాల నిమజ్జన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కరీంనగర్ తో పాటు జమ్మికుంట , హుజురాబాద్, చిగురుమామిడి, చొప్పదండి, గంగాధర ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు... కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ... నిమజ్జనంలో ఎటువంటి సమస్యలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

(పీటీసీ, కరీంనగర్)

**<u>మామునూరు-సర్వే</u>**

భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థకి చెందిన ఇంజినీరింగ్ బృందం వరంగల్ జిల్లలోని మామునూరు విమానాశ్రయ నిర్మాణ స్థలంలో ప్రాథమిక సర్వే నిర్వహించింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఈ బృందం విమానాశ్రయ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి , పరిశీలన జరిపింది.

అనంతరం,  బృంద సభ్యులు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో సమావేశమై          , ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి గుర్తించిన కీలక అంశాలపై చర్చించారు.

(పీటీసీ, వరంగల్)

**<u>మంత్రి మహేందర్ రెడ్డి</u>**

ప్రస్తుత ఆధునిక ,  ఉరుకుల పరుగుల జీవితంలో శాంతి   ,  ఏకాగ్రత,  ఆరోగ్యం కోసం యోగా ఎంతగానో అవసరమని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈరోజు       మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని అలంకృత రిసార్ట్ లో నిర్వహించిన బోధి స్కూల్ ఆఫ్ యోగ జాతీయస్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

(పీటీసీ, మేడ్చల్ మల్కాజిగిరి)